## క్లుప్తంగా

### పంచాయతీ ఆస్తుల ఆక్రమణపై వినతి



**తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల):** దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకలపూడిలో గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తున్నారని సర్పంచ్ గంపల గంగాధర్ యాదవ్ గురువారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2021 ఫిబ్రవరి 9న పంచాయతీ సర్పంచ్‌గా చెరువులు, పంచాయతీ స్థలాల ఆక్రమణలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు మళ్లీ చెరువు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు.పెరుకలపూడిలో ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ ఆస్తులను కాపాడి గ్రామ స్వరాజ్యానికి తోడ్పడాలని కోరారు.

### వయోజనుల అక్షరాస్యతకు 'ఉల్లాస్'



**ఫిరంగిపురం:** వయోజనుల అక్షరాస్యత కోసమే ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ వి.శంకర్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉల్లాస్ పథకంపై వెలుగు వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని కోరారు. తమ పరిధిలోని వయోజనులకు విద్యాభ్యాసం చేసేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, కరిముల్లా పాల్గొన్నారు.

### నట్టల నివారణతోనే ఆరోగ్యం



**ఫిరంగిపురం:** నట్టల నివారణతోనే పశువులకు ఆరోగ్యమని పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి ప్రారంభించారు. పీర్ అహ్మద్ శీతాకాలంలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పశువులు శీతాకాలంలో ఎదకు ఎక్కువగా వస్తాయని, ఎద ఇంజక్షన్లు వేయించాలన్నారు. 43 పశువులకు నట్టలనివారణ మందు, గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఎం.ఈశ్వరరెడ్డి, చింతలపాటి లక్ష్మీనారాయణ, పి. కోటిరెడ్డి, వై.నరసింహారావు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** పెదవడ్లపూడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తోట చల్లారావు మరణించడంతో, కుటుంబ సభ్యులకు టీడీపీ శాశ్వత సభ్యుడు అన్నె చంద్రశేఖర్ రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తాను రూ.10 వేలు, జనసేన తరుపున రూ.15 వేలు అందజేసినట్లు వెల్లడించారు. మాజీ సర్పంచ్ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

### బీమా నగదు చెక్కు అందజేత



**మంగళగిరి (తాడేపల్లిరూరల్) :** ఇటీవల మృతి చెందిన స్వర్ణకారుడు కొసనం బాలనాగేశ్వరరావు కుటుంబానికి ఇన్సూరెన్స్ మంజూరు అయ్యింది. రూ.3 లక్షల చెక్కును శ్రీ లక్ష్మీనరసింహ గోల్డ్‌స్మిత్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మృతుడు కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ స్వర్ణకార కుటుంబ సంక్షేమం కోసం నారా లోకేష్ ఇన్సూరెన్స్ సదుపాయం ఏర్పాటు చేశారని అన్నారు. ఎవరైనా స్వర్ణకారులు దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి అందించే ఇన్సూరెన్స్ నగదు కుటుంబానికి ఆధారమవుతుందని తెలిపారు.

# సినిమాకు వెళ్తే.. జేబుకు చిల్లే

- సినిమా హాళ్లలో తినుబండారాల మోత
- రూ.10 ఖరీదు చేసే దిల్‌పసంద్ రూ.40లు
- చిన్న సమోసా ధర రూ.10లు
- ఫోన్ పే, గూగుల్ పే ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవు
- మొద్దు నిద్రలో తనిఖీ అధికారులు

**సామాన్య ప్రజానీకానికి సినిమా** వినోదం భారంగా మారింది. థియేటర్‌కు వెళ్తే.. నిజంగానే 'సినిమా' కనిపిస్తోందని ప్రేక్షకులు భయపడుతున్నారు. సినిమా విడుదలైన పది రోజుల పాటు టికెట్ల ధరలు అమాంతం పెంచేస్తూ ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. ఈ భారానికి తోడు థియేటర్లలో తినుబండారాల ధరలకూ అడ్డూ అదుపు లేకుండా పోయింది. సినిమా హాళ్లలో నిబంధనల అమలు చేయాల్సిన అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు.



మంగళగిరిలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్



క్యాంటీన్ వద్ద తినుబండారాలు కొనుగోలు చేస్తున్న ప్రేక్షకులు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 10 సినిమా థియేటర్లు ఉన్నాయి. స్టార్ హీరోల సినిమా వచ్చిందంటే బెనిఫిట్ షోలు వేయడంతో పాటు అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. టికెట్ మీద రూ.50 నుంచి రూ.100 లు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తోంది. ఇదో రకం దోపిడీ అయితే సినిమా హాల్ లోపలికి వెళ్లిన తర్వాత మరో రకమైన దోపిడీకి ప్రేక్షకులు జేబులు ఖాళీ చేస్తోంది. అధిక ధరలకు తినుబండారాల విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం థియేటర్లలో తినుబండారాల ధరల పట్టిక నిర్వహించాలి. ఇది ఏ హాల్‌లో చూసినా కనిపించదు. చిన్నపాటి దిల్ పసంద్ ముక్క మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.15లకు విక్రయిస్తుంటే.. సినిమా హాళ్లలో రూ.40 అమ్ముతున్నారు. ఇక పాప్ కార్న్ ధర పెద్ద ప్యాకెట్ రూ.100, చిన్న ప్యాకెట్ ధర రూ.50కి చెబుతున్నారు. చిన్నపాటి సమోసాలు బయట రూ.5లు అయితే.. సినిమా హాళ్లలో రూ.10లు. ఇక కూల్ డ్రింక్స్, ఇతర తినుబండారాలకు సైతం పెద్ద ఎత్తున ధర నిర్ణయించి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది.

### నిబంధనలెక్కడ?

సినిమా హాళ్లలో వసతులు, సౌకర్యాలపై తరచూ సమీక్షిస్తుండడం, ప్రేక్షకుల నుంచి ఫిర్యాదులు వస్తే స్పందించి చర్యలు తీసుకోవడం, టిక్కెట్ల విషయం, క్యాంటీన్లలో తిను బండారాలు, పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల పార్కింగ్ ధరలు ఇలా అన్ని అంశాలపై ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే మంగళగిరి నియోజకవర్గంలో ఎక్కడా మచ్చుకైనా ఇవి అమలు కావడంలో లేదు. అదే రీతిలో ఉన్నతాధికారులు సమీక్షించిన దాఖలాలు లేవు. కొన్ని ఏసీ హాళ్లలో అయితే ఏసీలు పనిచేయకపోవడం, సరైన సీటింగ్ వసతి లేకపోవడం ఇలా సమస్యలు కోకొల్లలు. థియేటర్ లోపల సినిమా మొదలవ్వగానే వేసిన ఏసీ ఇంటర్వెల్ తర్వాత పనిచేయవు. అదేమని ప్రేక్షకులు ప్రశ్నిస్తే సినిమా చూస్తే చూడు లేకుంటే వెళ్లిపో అని బెదిరించడం సర్వసాధారణమైంది.

### ఆన్‌లైన్ పేమెంట్‌కు నో..

తినుబండారాలు కొనుగోలు చేసిన ప్రేక్షకులు నగదు రూపంలో మాత్రమే చెల్లింపులు చేయాలి. ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవని సినిమా హాళ్ల సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు జరిగితే అక్కడ ధరల విషయం బయటికి తెలిసిపోతుందని ఆంక్షలు పెడుతున్నారు. తినుబండారాల ధరలపై ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో సినిమా టిక్కెట్ ధరలతో పాటు తినుబండారాలకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. నలుగురు సభ్యులున్న కుటుంబం సినిమాకు వెళ్తే టిక్కెట్లకు రూ.1,200, తినుబండారాలకు మరో రూ.400 దాదాపు రూ.1600 వరకు ఖర్చు అవుతోంది.

### ఎలుకల బెడద

మంగళగిరి నియోజకవర్గ ఉన్న 10 సినిమా హాళ్లలో కొన్ని హాళ్లలో ఎలుకల, నల్లుల బెడద ఎక్కువగా ఉంది. ప్రేక్షకులు తీసుకువెళ్లిన తినుబండారాలు అరకొర కిందపడితే తినడం కోసం అవి వస్తుంటాయి. ఆ సమయంలో ప్రేక్షకుల కాళ్లమీదుగా వెళ్లిన సందర్భాలు కోకొల్లలు. ఇంత డబ్బు ఖర్చు పెట్టి సినిమాకు వస్తే ఎలుకల బెడద ఏమిటంటూ ప్రేక్షకులు వాపోతున్నారు.

### ప్రభుత్వ నిబంధనలు పాటించాలి...

సినిమా హాళ్లలో అగ్ని నిరోధక పరికరాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార పదార్థాల విక్రయాలపై రెవిన్యూ యంత్రాంగాలతో పాటు నగర పాలక సంస్థ, అగ్నిమాపక, కార్మిక, తూనికల కొలతల విభాగం తదితర శాఖలన్నీ పర్యవేక్షిస్తుండాలి. కానీ ఆయా శాఖల అధికారులు కొత్త సినిమా టిక్కెట్లు తీసుకుని చూసీచూడనట్లు పోతున్నారనే విమర్శలు లేకపోలేదు.

### వేలాది మంది సమస్యపై తీవ్ర నిర్లక్ష్యం

మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 10 సినిమా థియేటర్లు ఉండగా ప్రతిరోజూ నాలుగు షోలు వేస్తుంటారు. పండుగ సీజన్ కావడంతో ఐదు షోలు కూడా వేశారు. ప్రతిరోజూ వేలాది మంది సినిమా చూస్తుంటారు. ఇంతమంది జనం ఇబ్బందులు పడుతున్నా సినిమా హాళ్లలో నిబంధనల అమలుపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సినిమా హాళ్ల యజమానులు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. తినుబండారాల ధరలు, నాణ్యతకు సంబంధించి అధికారులు ఎందుకు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. జనం పెద్ద ఎత్తున వెళ్లే సినిమా హాళ్లలో తినుబండారాలు, ఇతర నిబంధనలను ఖచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

### దళితుల ఆర్థిక పరిస్థితిపై సర్వే

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం దళితుల ఆర్థిక పరిస్థితులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కాక విద్యార్థులను ఆయా స్కూళ్ల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ఉపాధి హామీ పనులు 100 రోజులు జరగడం లేదని, ప్రస్తుతం పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, సాంబయ్య, దావీదు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**తాడేపల్లిరూరల్:** బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 3 దశాబ్దాలకు పైగా కార్మికులు న్యాయ పోరాటం చేస్తున్నా వారి సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. పాలక పక్షాలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూరపాటి స్టీవెన్, అంకయ్య, ఆశీర్వాదం, ఇశ్రాయేలు, కె. ఆదినారాయణ, శివకుమారి, రమణ, దుర్గాభవాని, అన్నమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీకి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న నేతాజీ సేవాదళ్ సభ్యులు



నేతాజీ వేషధారణలో చిన్నారులు

**తాడేపల్లిరూరల్:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని తాడేపల్లి పట్టణ పరిధిలో నేతాజీ సెంటర్‌లో నేతాజీ సేవా దళ్ ఆధ్వర్యంలోగురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవాదళ్ గౌరవ అధ్యక్షుడు చింత శ్రీరామ్ మాట్లాడుతూ జనవరి 23, 1897న సుభాష్ చంద్రబోస్ జన్మించారని, సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చని నమ్మి, దాన్ని ఆచరణలో పెట్టారన్నారు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలవ్వగా ఆంగ్లేయును దెబ్బతీయడానికి ఒక సువర్ణ అవకాశంగా బోస్ భావించారని తెలిపారు. ఆజాద్ హింద్ ఫౌజ్ అనే భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 1945 ఆగష్టు 18న తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో బోస్ మరణించినట్లు ప్రకటించారని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ సాంబశివరావు, సిద్ధి, జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, ఉంద్రు కల్యాణ్‌కుమార్, ఎండీ సర్దార్, పలగాని లక్ష్మణ్, కె.సూరయ్య, ఓలేటి రాము, టి.బాబు, బూరగ వెంకటేశ్వర్లు, బాలస్వామి పాల్గొన్నారు.

**అలరించిన నేతాజీ వేషధారణ**

**ఫిరంగిపురం:** స్వాతంత్ర్య యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని గ్రామ సర్పంచ్ మున్నంగి శివకుమారి అన్నారు. వేమవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి నిర్వహించారు. విద్యార్థుల బోస్ వేషధారణ ఆకట్టుకున్నాయి. విద్యా సెక్రటరీ వెంకటేష్ నాయక్, హెచ్ఎం దీవి కమల్ మోహన్, ఉపాధ్యాయుడు శేషు రవికుమార్ పాల్గొన్నారు.

**నేతాజీకి ఘన నివాళి**

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** పాత మంగళగిరి బోసు బొమ్మ సెంటర్ వద్ద గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు మునగాల నాగేశ్వరరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తాడికొండ:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శమని విశ్రాంత హెచ్ఎం జమ్ముల వీరాస్వామి అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని తుళ్లూరు గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హెల్త్ సూపర్ వైజర్ నరసింహారావు, గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

**మేడికొండూరు** : మండలంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత శరత్ నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఓడీలు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

**పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు**



హరిశ్చంద్రపురం నాయకులతో మాట్లాడుతున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

**హరిశ్చంద్రపురం(తాడికొండ):** ప్రజా వ్యతిరేఖ విధానాలు, హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేఖత పెరిగిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురం, ఐనవోలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావొస్తున్నా.. ఎన్నికల సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, ఫీజు రీ ఎంబయిర్స్‌మెంట్, కొత్త పింఛన్లు మంజూరు ఇలా పలు పథకాలను అటకెక్కించారని, దీంతో రాష్ట్రంలో పేద వర్గాలు నానా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. రాజధాని ప్రాంతంలో ఉపాధి లేక మహిళా కూలీలు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గంలో తమ ఉపాధి అవకాశాలను దెబ్బకొట్టారని పేదలు తన దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరి కష్ట సుఖాల్లో తాను తోడు నీడగా ఉంటాన్నారు. పార్టీని మరింతగా పటిష్టం చేసేందుకు గ్రామ, మండల కమిటీల నియామకం త్వరలో అందరి ఆమోదంతో జరుగనుందని చెప్పారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, మాజీ సొసైటీ చైర్మన్ నాయుడు నాగేశ్వరరావు, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, హరిశ్చంద్రపురం నాయకులు చనుమోలు రామారావు, సనకా హరిబాబు, సీహెచ్ నరసింహారావు, నాగరాజు, గద్దర్ చెన్నకేశవ, భోగిరాజు, ఐనవోలు గ్రామ నాయకులు పాలకాయల శేషగిరిరావు, కంచర్ల ఆనందరావు, క్రాంతి, యోహాను పాల్గొన్నారు.

# ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలి

**ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా**



ఉండవల్లిలో పంప్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషన్ అలీమ్‌బాషా

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బంది తప్పకుండా సేకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో గురువారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమయానికి వార్డుల్లోకి వెళితేనే పట్టణ నివాసులు చెత్తను వేరుచేసి వాహనానికి ఇస్తారన్నారు. చెత్త సేకరిస్తున్న సమయంలో ప్రతిరోజు ప్రతి వార్డులో గృహాల నుంచి చెత్తసేకరణ చేసినట్లుగా వారి నుంచి సంతకాలు పుస్తకంలో సేకరించాలని సూచించారు. డ్రెయినేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఉండవల్లి గ్రామంలోని నగరపాలక సంస్థ తాగునీటి సరఫరా పంప్ హౌస్‌ను పరిశీలించి నీటి సరఫరా వేళలు, ఫిల్టరింగ్, మోటార్‌ల పనితీరు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉండవల్లి గ్రామంలో స్మశాన వాటిక నందు సదుపాయాలు, కోతుల బెడదపై స్థానికులు ఫిర్యాదు చేయగా, పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ



**తాడేపల్లిరూరల్:** మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను తాడేపల్లి పట్టణ పరిధిలో పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, రూరల్ అధ్యక్షుడు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. చిగురు ఆశ్రమంలో తాడేపల్లి రూరల్ టీడీపీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ పాల్గొని అనాథ పిల్లల మధ్య కేక్ కటింగ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు. మంగళగిరిలో పలుచోట్ల టీడీపీ శ్రేణులు కేక్‌లు కట్‌చేసి దుస్తులు, పళ్లు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకి దేవి, పడవల మహేష్, బోగి వినోద్ పాల్గొన్నారు.

**అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ**

**ఫిరంగిపురం:** మండల కేంద్రంలో మంత్రి నారా లోకేష్ జన్మదినం గురువారం నిర్వహించారు. కొత్తపల్లి కోటేశ్వరరావు కేకు కట్ చేసి, నిర్మల్ హృదయ్ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

**జోష్‌గా లైవ్ మ్యూజిక్**

**మంగళగిరి (తాడేపల్లిరూరల్) :** ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో నిర్వహించిన లైవ్ మ్యూజిక్ గురువారం జోష్‌గా సాగింది. మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డులోని ఎన్ఆర్ఐ ఎదురుగా మైదానంలో ఏర్పాటు చేసిన లైవ్ మ్యూజిక్‌లో పలువురు గాయనీ గాయకులు గీతాలు ఆలపించారు. ప్లేబ్యాక్ సింగర్స్ సాకేత్, శిల్ప యువతలో జోష్ పెంచే గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళగిరి టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, తమ్మిశెట్టి జానకిదేవి తదితరులు పాల్గొన్నారు.

**తెలుగుదేశం భవిష్యత్తు నారా లోకేష్**

**తాడేపల్లిరూరల్** : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్ మంత్రి నారా లోకేష్ తోనే సాధ్యమవుతుందని పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. గురువారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ విద్యార్థులు నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. టీడీపీ కార్యకర్తలందరూ పార్టీ రథసారథి లోకేష్ ఉండాలని సంకల్పంతో ఉన్నారన్నారు. టీడీపీ భవిష్యత్తు నారా లోకేష్ అన్నారు.

### నేడు డాక్టర్ సీతారామమ్మ బంగారు పతకం ప్రదానం

**తెనాలి:** తెనాలికి వాసి, ప్రవాస భారతీయ వైద్యురాలు డాక్టర్ వడ్లమూడి సీతారామమ్మ మెమోరియల్ గోల్డ్ మెడల్ ఎండోమెంట్ లెక్చర్ సమావేశం శుక్రవారం రాత్రి 8 గంటలకు ఐఎంఏ హాలులో జరగనుంది. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకరబాబు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి డాక్టర్ సీతారామమ్మ వడ్లమూడి మెమోరియల్ గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు.

# ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న అంబటి రాయుడు

**తాడేపల్లిరూరల్:** మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్, సీజన్-3 పోటీలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు గుంటూరు- నెల్లూరు మధ్య ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విజేతలకు భారత మాజీ క్రికెటర్ అంబటిరాయుడు ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ ఎఫెక్ట్ కౌన్సిల్ మెంబర్ దంతుగౌరు విష్ణుతేజ్ నగదు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు. తృతీయ స్థానం కోసం కడప - విజయనగరం మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు విజయం సాధించి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3 లక్షల నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్ష నగదు అందజేశారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

### 'తెలుగు కీర్తి' ప్రతిభా పురస్కారం ప్రదానం

**తెనాలి:** వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలను తెనాలికి చెందిన పలువురు కవులు స్వీకరించారు. వీరిలో తెనాలికి చెందిన కవి రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ) కూడా ఉన్నారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి వీరిని సత్కరించారు. సత్కారగ్రహీతను పలువురు అభినందించారు.

### కొనసాగుతున్న సదరం ప్రత్యేక క్యాంప్

**తెనాలిఅర్బన్:** తెనాలి జిల్లా వైద్యశాలలో ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. 100 మంది కంటి, 50 మంది వినికిడికి సంబంధించిన పరీక్షలు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు. నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ డాక్టర్ ఎం.చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన అప్తామాలజీ డాక్టర్ ఆషాకిరణ్, నర్సారావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్.హేమశ్రీ రోగులకు వైద్య పరీక్షలు చేశారు.